క్లుప్తంగా

అర్హత ఆధారంగా సదరం సర్టిఫికెట్ల మంజూరు


వికలాంగ నిర్ధారణ పరీక్ష చేస్తున్న డాక్టర్ మల్లికార్జున

కోసిగి: వికలాంగ పరీక్షల ఆధారంగా సదరం సర్టిఫికెట్స్ మంజూరు చేస్తున్నట్లు ఆర్థోపెడిక్స్ సర్జన్ డాక్టర్ మల్లికార్జున తెలిపారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ అభిరూప్‌తో కలిసి వికలాంగులకు సదరం క్యాంప్ నిర్వహించారు. సచివాలయ, మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న వారికి వైద్య పరీక్షలు చేశారు. 15 మంది వైద్య పరీక్షలు చేసి సర్టిఫికెట్స్ పరిశీలించారు. అర్హత కలిగి వారికి 15 నుంచి 20 రోజుల్లోగా దరఖాస్తు కేంద్రాల వద్దకే సదరం సర్టిఫికెట్స్ వస్తాయని తెలిపారు. అక్కడ సర్టిఫికెట్స్ పొందవచ్చన్నారు.

అంజన్నకు అభిషేకాలు



కౌతాళం: మండలంలోని ఆంజనేయ స్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిశాయి. కౌతాళం, అగసలదిన్నె, సుళేకేరి, ఎరిగేరి గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాలకు భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వార్లకు అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం తదితర ప్రత్యేక పూజలు చేపట్టారు.

శ్రీమఠంలో బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు


రాఘవేంద్ర స్వామి జ్ఞాపిక అందుకుంటున్న అన్నామలై

మంత్రాలయం: రాఘవేంద్ర స్వామి దర్శనార్థమై బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై శనివారం మంత్రాలయం విచ్చేశారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ దర్శించుకుని అర్చన, హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్ర మూలబృందావనం చేరుకుని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్రుని జ్ఞాపిక, శేషవస్త్రం, ఫలపూలమంత్రాక్షింతలతో ఆశీర్వదించారు. శ్రీ మఠం మేనేజర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి మఠం మర్యాదలతో ఆహ్వానం పలికారు.

క్యాంపస్ సెలక్షన్స్‌లో 29 మందికి ఉద్యోగాలు


నియామక పత్రాలు అందుకున్న విద్యార్థులు

ఆదోని సెంట్రల్: ఆదోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం జరిగిన క్యాంపస్ సెలక్షన్స్‌లో 29 మంది డిప్లొమా విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి తెలిపారు. చెన్నైకు చెందిన రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారని చెప్పారు. ఇందులో కళాశాలకు చెందిన ఎలక్ట్రిక్ విభాగం విద్యార్థులు 17 మంది, ఎలక్ట్రానిక్స్ విభాగంలో 12 మంది విద్యార్థులు ఎంపికైనట్లు వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఆదోని ట్రాన్స్‌కో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి. చంద్రశేఖర్, ప్లేస్‌మెంట్ అధికారులు కె.రామసుబ్బారెడ్డి, జె. కిరణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సారా బట్టీల ధ్వంసం


డ్రమ్ములను స్వాధీనం చేసుకుంటున్న సెబ్ పోలీసులు

ఆదోని రూరల్: మండలంలోని సముద్రపు కుంట, కొండగుట్ట వద్ద శనివారం 1,400 లీటర్ల బెల్లం ఊట, 20 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేసినట్లు సెబ్ సీఐ విన్నీలత తెలిపారు. అలాగే ఆదోని పట్టణం వాల్మీకినగర్‌కు చెందిన ఈరమ్మ నుంచి 24 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఎప్పటికప్పుడు అక్రమ మద్యం, నాటుసారాపై ఉక్కుపాదం మోపుతున్నామని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. దాడుల్లో సెబ్ ఎస్ఐ ఇస్మాయిల్, సిబ్బంది ఉన్నారు.

దివ్యాంగుల భవితకు భరోసా

- ముమ్మరంగా ఇంటింటి సర్వే
- ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు
- బడిలో చేర్పించేలా చర్యలు

ఎమ్మిగనూరుటౌన్: దివ్యాంగులు, ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి వారిని బడిబాట పట్టించేందుకు విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం మండలాల్లో ఆయా విభాగాలకు చెందిన పిల్లలను గుర్తించేందుకు ఐఈఆర్పీలు ఇంటింటి సర్వే ముమ్మరం చేశారు. ఇప్పటివరకు పాఠశాలల్లో చేరని వారు, మధ్యలో బడి మానేసిన దివ్యాంగులు, బుద్ధిమాంద్యం గల పిల్లల వివరాలను సేకరిస్తూ భవిత కేంద్రాల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకొంటున్నారు. ఆయా విభాగాల పిల్లలకు చదువులు నేర్పడం ద్వారా ఒనగూరే ప్రయోజనాలు, వారి సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న రాయితీలు, సదుపాయాలను తల్లిదండ్రులకు వివరిస్తూ ఐఈఆర్పీలు సర్వే చేస్తున్నారు. తల్లిదండ్రుల్లో సరైన అవగాహన లేక దివ్యాంగులు, బుద్ధి మాంద్యం గల పిల్లలను ఇంటికే పరిమితం చేస్తున్నారు.దీం తో వారు ఇళ్లలోనే మగ్గిపోతూ బాహ్య ప్రపంచం సైతం చూడని దుస్థితి నెలకొంది. అలాంటి పిల్లలను గుర్తించి భవిత కేంద్రాల్లో చేర్పించేందుకు సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆరా తీస్తున్నారు. పాఠశాలలు పునః ప్రారంభమయ్యేలోగా వారిని భవిత కేంద్రాల వైపు నడిపించాలనే సంకల్పంతో తల్లిదండ్రులను ఒప్పించే పనిలో ఐఈఆర్పీలు శ్రమిస్తున్నారు.


ఎమ్మిగనూరులో భవిత సర్వే చేస్తున్న ఐఈఆర్‌టీ బాబు

భవిత కేంద్రాల్లో చేర్పిస్తే ప్రయోజనాలు

దివ్యాంగులు, బుద్ధి మాంద్యం గల పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పించడం ద్వారా ఉచితంగా వారికి అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయడంతో పాటు చదువుకునేందుకు అవసరమైన ఉపకరణాలు అందిస్తారు. పాఠశాలలో చేరే ప్రతి ఒక్కరికీ నెలకు రూ.300 చొప్పున రవాణా చార్జీలు, వారి వెంట వచ్చే వారికి నెలకు రూ.250, బాలికలకు ప్రత్యేకంగా ఉపకారవేతనం రూ.250, పాఠశాలకు రాలేనివారుంటే వారికి ఇంటివద్దకే వెళ్లి అవసరమైన బోధనతో పాటు శిక్షణ ఇచ్చే సౌకర్యం ఉంటుంది. ఇంటివద్ద చదువుకునే వారికి సైతం నెలకు రూ.300 అందిస్తారు. అదేవిధంగా పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, బూట్లు, మధ్యాహ్న భోజనం లాంటి అన్ని వసతులను భవిత కేంద్రాల్లో సమకూర్చుతున్నారు. వినికిడి, దృష్టి లోపం ఉన్న వారు చదువుకునేందుకు వీలుగా ఉచితంగా ట్యాబ్‌లు అందిస్తారు. తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు జాతీయ ఉపకార వేతనం కింద ఏటా రూ.9 వేల నుంచి రూ.11 వేలు అందించడం జరుగుతోంది. వైకల్య శాతం అధికంగా ఉన్న వారు సదరం ధ్రువ పత్రాలు కలిగిఉంటే వారికి పింఛన్లు, ఉచిత బస్సు ప్రయాణం, రైలు ప్రయాణాల్లో రాయితీ లభిస్తుంది.

సద్వినియోగం చేసుకోవాలి



దివ్యాంగులు, బుద్ధి మాంద్యం గల పిల్లలను భవిత కేంద్రంలో చేర్పించి ప్రభుత్వం అందించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి. ఆయా విభాగాల పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పించడం ద్వారా విద్య బుద్ధులు నేర్పించడం జరుగుతుంది. భవిష్యత్తులో వారు ఉన్నతంగా ఎదిగేందుకు అవకాశం ఉంటుంది.

– మధుసూదన్‌రాజు, ఎంఈఓ–2, ఎమ్మిగనూరు

గతేడాది 73 మందికి లబ్ధి

గతేడాది భవిత కేంద్రంలో చదువుకున్న విభిన్న ప్రతిభావంతులైన 73 మంది విద్యార్థులకు ప్రభుత్వ పథకాలద్వారా లబ్ధి చేకూరింది. వారికి చదువు నేర్పించడంతో పాటు రవాణా ఖర్చులు, స్కాలర్‌షిప్‌లు అందించడం జరిగింది. ఇప్పటివరకు చేసిన సర్వేలో 19 మంది బాలలను గుర్తించాం. వారిని భవిత కేంద్రాల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ముందుకొచ్చారు. దివ్యాంగుల భవిత కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి.

– బాబు, ఐఈఆర్పీ, భవిత కేంద్రం, ఎమ్మిగనూరు

పిల్లలను అపహరిస్తే కఠిన శిక్షలు


అవగాహన కల్పిస్తున్న రెండో అడిషనల్ న్యాయమూర్తి సాయిశ్రీవల్లి

ఆదోని రూరల్: పిల్లలను అపహరిస్తే కఠిన శిక్షలే ఉంటాయని రెండో అడిషనల్ న్యాయమూర్తి సాయి శ్రీవల్లి అన్నారు. అంతర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం పురస్కరించుకుని శనివారం పట్టణంలోని బోయగేరిలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా సాయిశ్రీవల్లి, ఆదోని వన్‌టౌన్ సీఐ తేజమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. పిల్లలకు మంచి విద్యాబుద్ధులు, నడవడిక నేర్పించాలన్నారు. బాగా చదివించి ఉన్నత ఉద్యోగాలు సాధించేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ చట్టాలు, హక్కులను తెలుసుకోవాలన్నారు. పిల్లలను అపహరణ చేసి డబ్బులు డిమాండ్ చేసే వారు ఉంటారని, కొంత మంది భిక్షాటన చేయించి సొమ్ము చేసుకుంటారని చెప్పారు. అలాంటి వారిపై పోలీసుశాఖ కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. సీనియర్ న్యాయవాది లోకేష్‌కుమార్ పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. జూనియర్ న్యాయవాదులు హుసేన్‌సాని, కళ్యాణ్ రెడ్డి, శ్రీధర్‌సింగ్, ఈరన్న పాల్గొన్నారు.

కౌంటింగ్ వేళ గొడవలకు పాల్పడితే చర్యలు

ఆదోని రూరల్: ఎన్నికల కౌంటింగ్ రోజున (జూన్ 4వ తేదీ) అల్లర్లు, గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శివనారాయణ స్వామి, ఆదోని రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు శనివారం మండలంలోని సంతెకూడ్లూరు గ్రామంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా పోలీసుశాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఎవరైనా రాజకీయ పార్టీల నాయకులు ఉద్దేశపూర్వకంగా గొడవలు సృష్టించినా, ప్రజలను భయభ్రాంతులకు గురి చేసినా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు.


సంతెకూడ్లూరులో రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న డీఎస్పీ

ఎన్నికల కౌంటింగ్ పూర్తి అయ్యేంత వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఫలితం ఎలా ఉన్నా అందరూ సంయమనం పాటించాలని సూచించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


అవగాహన కల్పిస్తున్న సీఐ ప్రసాద్, ఎస్ఐ

కోసిగి: మరో పది రోజుల్లో సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ ప్రసాద్, ఎస్ఐ సతీష్‌కుమార్ హెచ్చరించారు. శనివారం కోసిగి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ప్రజలకు అవగాహన సదస్సు కల్పించారు. జూన్ 4వ తేదీ ఎవరు గెలిచినా ఓడినా ప్రతి ఒక్కరూ శాంతియుతంగా నడుచుకోవాలని సూచించారు. ప్రజల తీర్పు ఆధారంగా గెలుపు ఓటములు ఉంటాయన్నారు. ఎన్నికల ఫలితాల రోజున బాణాసంచా పేల్చడం, చిందులు వేయడం, సంబరాలు జరుపుకోవడం చేయరాదన్నారు. పాతకక్షలు మనుసులో ఉంచుకుని కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గొడవలకు పాల్పడితే జీవితాలు నాశనం అవుతాయన్నారు. ఎలాంటి సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

లైంగికదాడి కేసుపై డీఎస్పీ విచారణ

హాలహర్వి: రెండు రోజుల క్రితం మండల కేంద్రంలో జరిగిన బాలికపై లైంగిక దాడి కేసుపై పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి శనివారం విచారణ చేపట్టారు. ఆయన స్టేషన్‌కు చేరుకుని కేసు విషయమై ఎస్ నరేంద్రను ఆరా తీశారు. బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు వీరేష్‌ను ఉదయమే అరెస్ట్ చేసి జైలుకు తరలించామని డీఎస్పీకి ఎస్ఐ విన్నవించారు. అనంతరం బాలిక ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను విచారించారు. ఆ తర్వాత కాసేపు స్థానికులతో మాట్లాడారు. గ్రామంలో ఐకమత్యంగా ఉండాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు ఉన్నారు.


స్థానికులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

వైద్యుడి మృతికి సంతాపం


చేకూరి చిన్న పుల్లయ్య (ఫైల్)

ఆదోని అర్బన్: పట్టణంలో ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు చేకూరి చిన్నపుల్లయ్య శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో మృతిచెందారు. ఆయన మృతిపై న్యాయవాదులు, వైద్యులు ప్రగాఢ సంతాపం తెలిపారు. చేకూరి చిన్నపుల్లయ్య గతంలో లాయర్‌గా కూడా పనిచేశారని, అసోసియేషన్‌లో సభ్యుడిగా ఉన్నారని గుర్తు చేసుకున్నారు. పట్టణంలో మొట్టమొదటి ఆర్థోపెడిక్ వైద్యుడిగా ప్రజలకు సేవలు అందించారని కొనియాడారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. అల్లుడు విజయ్‌కుమార్ ఆర్థోపెడిక్ వైద్యుడిగా పని చేస్తున్నారు.

క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్తు


ర్యాలీలో పాల్గొన్న చిన్నారులు

ఆదోని సెంట్రల్: విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని సీయోను ప్రార్థన మందిరం పాస్టర్ తిమోతి సిస్టర్ బ్లెస్సీ అన్నారు. శనివారం విరామ బైబిల్ పాఠశాల ముగింపు కార్యక్రమంలో వారు మాట్లాడారు. అనంతరం పిల్లలతో కలిసి పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఆదోని అర్బన్: ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆవరణలో ఆర్ఎస్ నర్సింగ్ కాలేజ్ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేశారు. ఆర్ఎస్ నర్సింగ్, పారా మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో ప్రతి నెలా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ శివరాముడు తెలిపారు. కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నరేష్ ఆచారి, డాక్టర్ రాజు, హేమంత్, ప్రసన్న, ఆనంద్ పాల్గొన్నారు.

దర్గా అభివృద్ధికి కృషి చేస్తా


దర్గాలో స్వామికి పూలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

- ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

కౌతాళం: ఖాదర్‌లింగస్వామి దర్గా అభివృద్ధి కృషి చేస్తానని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన ఉరుకుంద ఈరన్నస్వామిని, బుడుములదొడ్డి ఆంజనేయస్వామిని, కౌతాళం ఖాదర్ లింగస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌పీ విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. ఖాదర్‌లింగస్వామి ఆశీస్సులతో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని, తనతో పాటు తన సోదరులు బాలనాగిరెడ్డి, వెంకటరామిరెడ్డిలు కూడ ఎమ్మెల్యేలుగా విజయం సాధిస్తామన్నారు. ఆయన వెంట సర్పంచ్ పాల్‌దినకర్, మాజీ సర్పంచ్ అవతారం, ఉరుకుంద ట్రస్ట్‌బోర్డు డైరెక్టర్ వెంకోబ, నాయకులు వడ్డె రాము, పూజారి లింగ, పల్లెద వీరేష్ తదితరులు ఉన్నారు.

ఐఎన్ఐ సెట్‌లో ఆదోని వాసి ప్రతిభ


డాక్టర్ శ్రీనివాస్తవ్

ఆదోని సెంట్రల్: పీజీ వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇమ్‌పార్టెన్స్ కంబైన్డ్ ఇన్‌ట్రెన్స్ టెస్ట్(ఐఎన్ఐ–సెట్)లో ఆదోని పట్టణానికి చెందిన జి.సీతారాముడు, వెంకటలక్ష్మీ కుమారుడు డాక్టర్ జి.శ్రీనివాస్తవ్ ప్రతిభ చాటారు. ఆల్ ఇండియా 65 ర్యాంకు సాధించారు. కాగా ఆయన తండ్రి పారా మెడికల్ విభాగంలో పనిచేస్తున్నారు. తల్లి వెంకటలక్ష్మి గృహిణి. కార్డియాలజిస్టుగా ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని శ్రీనివాస్తవ్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


హరిప్రసాద్ (ఫైల్)

ఆదోని సెంట్రల్: పట్టణానికి చెందిన శెట్టి బలిజ కృష్ణ కుమారుడు శెట్టి బలిజ హరిప్రసాద్(30) శనివారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇస్వి ఆర్ఎస్ మార్గంలో కిలోమీటర్ నంబర్ 498/25–23 వద్ద అప్‌లైన్ ట్రాక్ మధ్యలో కోయంబత్తూరు ఎక్స్‌ప్రెస్ (11013) కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సాయి సర్వేశ్వరరావు తెలిపారు. మృతికి గల కారణాలు తెలియరాలేదన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రక్తహీనతతో అనారోగ్య సమస్యలు

కర్నూలు(హాస్పిటల్): రక్తహీనత కారణంగా పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారిణి హేమలత చెప్పారు. శనివారం నగర శివారులోని భూపాల్‌నగర్ గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గర్భిణులకు, కౌమార దశ బాలికలకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. రక్తహీనత మూలంగా మహిళల్లో ఎన్నో రకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని, అందులో అలసట, నీరసం వంటి సాధారణ ఆరోగ్య సమస్యలతో పాటు నెలసరి సమయంలో హెచ్చు తగ్గులు, గర్భం ధరించలేకపోవడం, ఒకవేళ గర్భం వచ్చినా అది నిలవకపోవడం, ప్రసూతి మరణాలు పెరిగిపోవడం వంటి సమస్యలు తప్పవని తెలిపారు. దీన్ని అధిగమించాలంటే ఐరన్ అధికంగా ఉన్న ఆకుకూరలు, పండ్లు, ఖర్జూరాలు, దానిమ్మ, చిక్కుడుకాయలు లాంటి ఆహార పదార్థాలను తీసుకోవాలని, అలాగే ప్రభుత్వం అందించే ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వాడాలని, జంక్‌ఫుడ్, శీతల పానియాలకు దూరంగా ఉండాలని సూచించారు.

ఏపీఈఆర్‌సీ కార్యాలయం ప్రారంభించడం హర్షణీయం

- రఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి

కర్నూలు(అర్బన్): రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా ఏపీఈఆర్‌సీ కార్యాలయాన్ని హైదరాబాద్ నుంచి కర్నూలుకు తీసుకురావడం సర్వత్రా హర్షణీయమని రాయలసీమ యూనైటెడ్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి అన్నారు. ఇందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు చెబుతున్నట్లు ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే హైకోర్టును కూడా కర్నూలులో ఏర్పాటు చేయాలన్నారు. పాలనా వికేంద్రీకరణలో భాగంగా ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ కార్యాలయాన్ని కర్నూలులోనే ఏర్పాటు చేయాలని రాయలసీమ ఉద్యమ సంఘాలు గతంలోనే డిమాండ్ చేశాయన్నారు. అలాగే కర్నూలును సీడ్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ, విత్తన ధ్రువీకరణ సంస్థ ప్రధాన కార్యాలయాలను కూడా కర్నూలులోనే ఏర్పాటు చేయాలన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కర్నూలును న్యాయ రాజధానిగా చేసి శ్రీ బాగ్ ఒప్పందాన్ని అమలు చేసేందుకు రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించాలన్నారు. ఏపీఈఆర్‌సీ కార్యాలయం ఏర్పాటుకు సంబంధించి ఇంత హడావిడిగా ఎందుకు ప్రారంభించాలని కోస్తాంధ్ర నాయకులు ప్రశ్నించడం విడ్డూరంగా ఉందన్నారు.

గాలీవాన బీభత్సం

- 42.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు


గోనెగండ్లలో నేలకూలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

గోనెగండ్ల: మండలంలో శుక్రవారం సాయంత్రం భారీ ఉరుములు, మెరుపులతో గాలీవాన బీభత్సం సృష్టించింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రశాంతంగా ఉన్న వాతావరణం సాయంత్రం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన వాన కురిసింది. ఈదురు గాలులు తోడు కావడంతో మండల వ్యాప్తంగా 100 విద్యుత్ స్తంభాలు, 50 ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలాలడంతో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. పలు చోట్ల ప్రధాన రహదారులపై చెట్లు విరిగి పడటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మండలంలో 42.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. విద్యుత్ శాఖ డీఈ ఓబులేష్, ఏడీ రాఘవేంద్ర, ఏఈ సుధాకర్ రావులతో కలిసి శనివారం మండలంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. సాయంత్రంలోపు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



విరిగి పడిన విద్యుత్ స్తంభాలు


ఐరన్‌బండలో బంకుపై విరిగి పడిన చెట్టు


అధికారులతో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ డీఈ ఓబులేష్

కోలుకోలేక గ్రీన్‌కో విండ్ పవర్ కంపెనీ డ్రైవర్ మృతి


మృతిచెందిన చంద్ర

పెద్దనేలటూర్ గ్రామంలో గ్రీన్‌కో విండ్ పవర్ కంపెనీలో పనిచేస్తున్న డ్రైవర్ చంద్ర(35) కోలుకోలేక మృతిచెందాడు. కోడుమూరుకు చెందిన చంద్ర కొంతకాలంగా గ్రీన్‌కో విండ్‌పవర్ కంపెనీలో బొలెరా వాహనం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం వర్షం పడుతుండటంతో వాహనాన్ని సమీపంలోని విండోపవర్ రెక్కలు ఎత్తే క్రేన్ పక్కన నిలిపి అక్కడే తలదాచుకున్నాడు. ఈదురు గాలులకు క్రేన్ బొలెరా వాహనంతోపాటు చంద్రపై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. మరో ఇద్దరికీ కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పెంచికలపాడు విశ్వభారతి ఆస్పత్రికి తరలించగా అక్కడ కోలుకోలేక చంద్ర మృతిచెందాడు.

వికసించిన మే పుష్పం



కౌతాళం: మండల కేంద్రానికి చెందిన రాఘవేంద్రరెడ్డి ఇంటి పెరట్లో మే పుష్పం వికసించింది. వాతావరణానికి అనుగుణంగా మే లేదా జూన్ నెలలో ఈ పుష్పం వికసిస్తుంది. ఈ ఏడాది వర్షాలు ఇప్పటికే ప్రారంభం కావడంతో మే పుష్పం వికసించి పలువురిని ఆకర్శిస్తోంది.